**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 281 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 3 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి

## అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

- గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా రప్పించేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులతో సీఎం సమీక్ష
- విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు
- బాధితుల కోసం 24/7 ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు
- విమానాశ్రయాలు తెరుచుకునే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచన



మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే గుర్తించి సహాయం అందించాలన్నారు. ఆయా దేశాల్లోని భారతీయ ఎంబసీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, విమానాశ్రయాలు తిరిగి తెరుచుకుని సర్వీసులు ప్రారంభమయ్యే వరకు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా అవసరమైన వారికి తాత్కాలిక వసతి సౌకర్యాలు

- మిగతా2లో

## కృత్రిమ మేధ వినియోగించి.. పాలనలో సమర్థత పెంచాలి

### అధికారులకు సీఎం చంద్రబాబు సూచన



ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగించడం ద్వారా పాలనలో సమర్థత పెంచుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రజలకు ఉత్తమ సేవలు.. పనితీరు మెరుగుపరచుకునేందుకు ఉన్నతాధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ రెస్పాన్స్‌పై సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'డ్రోన్‌లు, సీసీ టీవీ కెమెరాలు,

- మిగతా2లో



## మరిన్ని భీకర దాడులు చేస్తాం

### ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు

- తమ జోలికి ఎవరు వచ్చినా వదిలి పెట్టేది లేదన్న డొనాల్డ్ ట్రంప్
- ప్రపంచంలో అమెరికా సైన్యం అత్యంత శక్తిమంతమైనదని ధీమా
- ఆ సైన్యాన్ని ఇప్పుడు ఉపయోగిస్తున్నామని వెల్లడి

- మిగతా2లో



### గల్ఫ్ దేశాల అధినేతలకు

## మోదీ ఫోన్..

ఇరాన్ దాడిని ఖండించిన ప్రధాని

- సౌదీ అరేబియా యువరాజుతో ఫోన్లో మాట్లాడిన మోదీ
- బహ్రెయిన్ రాజు ఖలీఫాతో భారతీయుల భద్రతపై చర్చించిన ప్రధాని
- సౌదీ, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడిని ఖండించిన నరేంద్ర మోదీ

- మిగతా2లో



## గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు వారికి టీడీపీ అండగా ఉంటుంది

- పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న టీడీపీ హైకమాండ్
- ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ ద్వారా బాధితులకు ఆహారం మరియు వసతి
- కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుంటూ చర్యలు
- బాధితుల కోసం 95500 57623, 79978 26882 హెల్ప్‌లైన్ నెంబర్లు

- మిగతా2లో

## రాష్ట్రంలో స్త్రీలపై నేరాలు తగ్గుదల



'మహిళలను అందరూ గౌరవించాలి. ఈ సంస్కృతి మన ఇళ్ల నుంచే ప్రారంభం కావాలి. ప్రస్తుత సమాజంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. స్త్రీల భద్రత, రక్షణపైనే సమాజ భద్రత ఆధారపడి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో స్త్రీలపై నేరాలు 4.4 శాతం తగ్గాయి. మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు చాలా కృషి చేస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే..

- మిగతా2లో





# యుద్ధం తీవ్రరూపం

## ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్

## గల్ఫ్‌లోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్న ఇరాన్

## సౌదీలోని అతి పెద్ద కేంద్రంపై దాడి - తాత్కాలికంగా మూసివేత

- ఎల్ఎన్‌జీ ఉత్పత్తిని నిలిపేసిన ఖతార్ ఎనర్జీ
- నెతన్యాహు ఇంటిపై దాడి చేశాం: ఇరాన్
- తప్పుడు వార్తలు: ఇజ్రాయెల్
- గాయపడిన ఖమేనీ సతీమణి మృతి
- యుద్ధంలోకి మిలిటెంట్ గ్రూపులు
- చమురు నౌకపై దాడిలో భారతీయుడి మృతి
- నతాంజ్ అణు కేంద్రంపై దాడి!
- భగ్గుమన్న చమురు ధరలు

### ఇరాన్‌లో 555 మంది మృతి

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్‌లో 555 మంది మరణించారు. ఇరాన్‌లో మరణించిన వారిలో చైనా జాతీయుడు ఒకరు ఉన్నారు. ఇరాన్‌లోని 130 నగరాలపై దాడులు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. ఇరాన్‌లోని నతాంజ్ అణు కేంద్రంపై ఆదివారం అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేశాయని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ రాయబారి రెజా నజాఫీ తెలిపారు.

బీరుట్‌పై జరిపిన దాడిలో హెజ్‌బొల్లా నిఘా విభాగం అధిపతిగా పని చేస్తున్న కమాండర్ హుసేన్ మాక్లెడ్ మరణించాడు. దక్షిణ లెబనాన్, బీరుట్‌లలో ప్రజలు పాఠశాలల్లో తలదాచుకుంటున్నారు.

దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రరూపం దాలుస్తోంది. మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. సోమవారం అనేక ప్రాంతాల్లో దాడులు కొనసాగాయి. ఇరాన్‌కు మద్దతుగా మిలిటెంట్ గ్రూపులూ రంగంలోకి దిగడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్ ఆయుధాగారాలను అమెరికా-ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంటుండగా.. గల్ఫ్ దేశాల్లోని చమురు శుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది. హర్మ్యూజ్ జల సంధిలో చమురు నౌకలపైనా ఇరాన్ దాడులకు దిగుతోంది. ఈ మార్గం మీదుగానే ప్రపంచానికి 20శాతం చమురు రవాణా అవుతోంది. ఈ దాడులవల్ల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు సంధికి ఇప్పట్లో అవకాశాలు కనిపించడం లేదు. చర్చలకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినా ఇరాన్ ససేమిరా అంది. యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వేల మంది విమాన ప్రయాణికులు చిక్కుకుపోయారు. తాము ఇరాన్‌తోపాటు గల్ఫ్ దేశాలతో మాట్లాడుతున్నామని రష్యా వెల్లడించింది. చర్చలు జరుగుతుండగానే అమెరికా దాడులు చేయడం తమను అసంతృప్తికి గురిచేసిందని వ్యాఖ్యానించింది.

- మిగతా2లో

# యుద్ధం తీవ్రరూపం

యుద్ధంలో అమెరికాతో కలిసి పని చేసేందుకు సిద్ధమని ఫ్రాన్స్, జర్మనీ ప్రకటించాయి. తమ సైన్యాన్ని పంపించబోమని బ్రిటన్ వెల్లడించింది.

ఇరాన్‌ను నిర్ణయాత్మకంగా దెబ్బ తీస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు.

ఖమేనీపై దాడి జరిగిన సందర్భంగా గాయపడిన ఆయన భార్య మన్సూరీ ఖొజాస్తే బాఘెర్జాదే (79) మరణించారు. ఖమేనీని ఆమె 1964లో పెళ్లాడారు. వారికి ఆరుగురు పిల్లలున్నారు. ఆమె బయట ఎక్కువగా కనిపించేవారు కాదు. దాడిలో గాయపడినప్పటి నుంచి ఆమె కోమాలోనే ఉన్నారు.

ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌లో సోమవారం సైరన్ మోతకు భయంతో ఓ గోడ వద్దకు చేరిన పౌరులు

**ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలే లక్ష్యం..**

ఇరాన్, ఆ దేశానికి మద్దతిస్తున్న మిలిటెంట్ గ్రూపులు.. ఇజ్రాయెల్, అరబ్ దేశాలపై సోమవారం దాడులు చేశాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై దాడి జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ముందుగానే ఎంబసీని ఖాళీ చేయించడంతో ప్రాణ నష్టం జరగలేదని తెలిసింది.

సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లో ఉన్న ప్రపంచంలోనే అతి పెద్ద వాటిలో ఒకటైన రస్ తనూరా చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. అయితే వాటిని అడ్డుకున్నామని సౌదీ రక్షణశాఖ వెల్లడించింది. కానీ ఆ ప్రాంతంలో నల్లని పొగ అలముకున్న వీడియోలు బయటకు వచ్చాయి. ప్రస్తుతానికి ఆ కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. రస్ తనూరాలో రోజుకు 5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును శుద్ధి చేస్తారు. ప్రపంచానికి దాదాపు 7శాతం చమురును ఈ కేంద్రం సరఫరా చేస్తుంది.

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మార్షల్ ఐలాండ్స్‌కు చెందిన చమురు రవాణా నౌక ఎంకేడీ వ్యోమ్‌ను బాంబుతో వచ్చిన డ్రోన్ బోట్‌తో ఇరాన్ పేల్చేసింది. ఈ ఘటనలో ఒకరు మరణించారు. చనిపోయిన వ్యక్తి భారతీయుడని ఒమన్ వెల్లడించింది. నౌకలోని మిగతా 21 మంది సిబ్బందిని రక్షించి మరో ఓడలోకి తరలించారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీయులు, ఒక ఉక్రెయిన్ జాతీయుడున్నారు.

కువైట్‌లోని అహ్మదీ చమురు శుద్ధి కేంద్రం వైపునకు దూసుకొచ్చిన రెండు డ్రోన్లను సైన్యం కూల్చేసింది. అయితే ఆ శిథిలాలు పడి ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. తమ దేశంలోని పౌర కేంద్రాలనూ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోందని కువైట్ ఆరోపించింది.

ఖతార్‌లోని మెసయీద్, రస్ లఫాన్‌లలోని విద్యుత్తు కేంద్రాలపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. మెసయీద్‌లో నీటి ట్యాంకు ధ్వంసమైంది. యుద్ధం కారణంగా తాము ద్రవీకృత సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) ఉత్పత్తిని నిలిపేస్తున్నామని ఖతార్ ఎనర్జీ ప్రకటించింది. ఇది ప్రపంచం మొత్తానికి ఎల్‌ఎన్‌జీని సరఫరా చేస్తుంది. దీంతో ఐరోపాలో ఎల్‌ఎన్‌జీ ధరలు 50% పెరిగాయి. రెండు ఇరాన్ యుద్ధ విమానాలను కూల్చేశామని ఖతార్ ప్రకటించింది.

అమెరికా యుద్ధ విమానాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. వివరాలను వెల్లడించలేదు. దీనిపై అమెరికా సైన్యమూ స్పందించలేదు.

తమపై ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను అడ్డుకున్నామని యూఏఈ ప్రకటించింది. అబుధాబీపై ప్రయోగించిన వాటిలో కొన్ని పేలాయని, మరికొన్ని చోట్ల శిథిలాలు పడి మరణాలు సంభవించాయని వెల్లడించింది. దుబాయ్‌లోనూ పేలుడు శబ్దాలు వినిపించాయి.

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని విమానాశ్రయంలో అమెరికా బలగాలపై సోమవారం దాడులు చేశామని ఇరాన్ అనుకూల మిలిటెంట్ గ్రూపు షియాటీ మిలీషియా సరయా ఆలియా అల్-దామ్ వెల్లడించింది. ఇర్బిల్‌లోని అమెరికా స్థావరంపై ఆదివారం దాడులు చేశామని తెలిపింది. సైప్రస్‌లోని బ్రిటన్ స్థావరంపైనా దాడులు చేశామని వివరించింది. డ్రోన్ దాడి కారణంగా బ్రిటన్ వైమానిక స్థావరం స్వల్పంగా దెబ్బతిందని సైప్రస్ తెలిపింది.

లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పైకి క్షిపణులను ప్రయోగించామని హెజ్‌బొల్లా వెల్లడించింది. వీటిలో ఒక ప్రొజెక్టైల్‌ను అడ్డుకున్నామని, మిగిలినవి ఖాళీ ప్రదేశాల్లో పడ్డాయని ఇజ్రాయెల్ తెలిపింది. ప్రతిగా తాము జరిపిన దాడుల్లో 31 మంది మరణించారని, 149 మంది గాయపడ్డారని వివరించింది. బీరుట్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

యుద్ధం మొదలైనప్పటి నుంచి తమ సైనికులు నలుగురు మరణించారని అమెరికా వెల్లడించింది.

ఇజ్రాయెల్ ప్రధాని ఇల్లు/కార్యాలయం, ఎయిర్‌ఫోర్స్ కమాండర్ ప్రధాన కార్యాలయంపై దాడులు చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. ఈ వార్తలను ఇజ్రాయెల్ ప్రభుత్వ వర్గాలు ఖండించాయి.

**ప్రతి దాడులు చేస్తాం: అరబ్ దేశాలు**

తమ దేశాల్లోని కీలక ప్రాంతాలపై ఇరాన్ దాడులు చేస్తోందని, ఇలాగే చేస్తే ప్రతి దాడులు చేస్తామని గల్ఫ్‌లోని అరబ్ దేశాలు హెచ్చరించాయి. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్స్ యుద్ధ విమానాలు మూడింటిని పొరపాటున కువైట్ కూల్చేసింది. సోమవారం ఇరాన్ దాడులు చేస్తున్న సమయంలో ఆ దేశానికి చెందినవిగా పొరపడి వాటిపై గగనతల రక్షణ వ్యవస్థలతో దాడులు చేసింది. వాటిలోని ఆరుగురు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు.

**చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్**

అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిశగా తాము ఆలోచించడం లేదని ఆ దేశ భద్రతాధికారి అలీ లారిజానీ తెలిపారు. 'ఈ దాడులను మేం మొదలు పెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ అధికార కాంక్ష కోసం అమెరికా సైనికులను బలి చేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మార్కెట్లు కుదేలు.. చమురు ధరల పెరుగుదల**

యుద్ధంతో ప్రపంచ మార్కెట్లు కుదేలయ్యాయి. చమురు ధరలు భారీగా పెరిగాయి. పెట్రో ధరలు (ఫ్యూచర్స్) కొన్నిచోట్ల 42% పెరగ్గా, ఎల్‌ఎన్‌జీ ధరలు(ఫ్యూచర్స్) 50% వరకూ పెరిగాయి.

## గల్ఫ్ దేశాల అధినేతలకు మోదీ ఫోన్.. ఇరాన్ దాడిని ఖండించిన ప్రధాని

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గల్ఫ్ దేశాల అధినేతలతో అక్కడి భారతీయుల భద్రతపై చర్చలు జరిపారు. అదే సమయంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఆయా దేశాధినేతలకు ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు.సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ సల్మాన్‌తో ప్రధాని మోదీ ఫోన్లో మాట్లాడారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతో కూడా మాట్లాడారు. ఆ దేశాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్‌ల నాయకులతో చర్చల సందర్భంగా ఆ దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు.అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్ దేశాల నాయకులతో ప్రధాని మోదీ నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు.

ఆదివారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్

అల్ నహ్యాన్‌తో కూడా మాట్లాడారు. భారతీయుల క్షేమం కోసం కృషి చేస్తున్నందుకు అల్ నహ్యాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని పరిస్థితిని సమీక్షించడానికి ప్రధానమంత్రి భద్రతా కేబినెట్ కమిటీ నిన్న సమావేశమైంది.

# మరిన్ని భీకర దాడులు చేస్తాం

మరిన్ని భీకర దాడులు చేస్తామని, ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ప్రతిదాడులు మూడో రోజు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, తమ జోలికి ఎవరు వచ్చినా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. త్వరలో మరిన్ని తీవ్ర దాడులు ఉంటాయని తెలిపారు. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని, వారు ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని సూచించారు.ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని అమెరికా కలిగి ఉందని, దానిని ఇప్పుడు ఉపయోగిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ సాఫీగా, తమకు ఎలాంటి ఇబ్బందిలేకుండా సాగుతోందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. ఇరాన్ ప్రజలు నియంత పాలన నుంచి స్వేచ్ఛ పొందడానికి అమెరికా ఈ సైనిక చర్యకు ఉపక్రమించిందని అన్నారు. ఇరాన్ ఇలాగే దాడులు కొనసాగిస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై అసలైన దాడిని ఇంకా ప్రారంభించలేదని, ఆ దేశం ఇలాగే వ్యవహరిస్తే దాడి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఆయన సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

# గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు వారికి టీడీపీ అండగా ఉంటుంది

గల్ఫ్ దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలుగు వారికి పూర్తి స్థాయిలో అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన తెలుగు బిడ్డలకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకోవడానికి తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.గత నాలుగు రోజులుగా గల్ఫ్ దేశాల్లో మారుతున్న పరిణామాలను ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ నిశితంగా గమనిస్తోందని పల్లా వెల్లడించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం ఎప్పటికప్పుడు గల్ఫ్ దేశాల కోఆర్డినేటర్లతో టెలికాన్ఫరెన్సులు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తోందని... ఎక్కడైతే అత్యవసర సహాయం అవసరమో, అక్కడ తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్కడి ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం సభ్యులు, తెలుగు సోదరులు బాధితులకు అవసరమైన తాత్కాలిక వసతి, ఆహారం, భద్రతా ఏర్పాట్లు చేయడంలో చురుగ్గా పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని పల్లా తెలిపారు. గల్ఫ్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తున్నామని, ఆయన స్వయంగా పర్యవేక్షిస్తూ యంత్రాంగానికి తగు సూచనలు ఇస్తున్నారని చెప్పారు. అక్కడి తెలుగు వారికి ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడటమే తమ ప్రథమ లక్ష్యమని, దీనికోసం కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. కేంద్రం సహకారంతో ప్రభావితులందరికీ తక్షణ సాయం అందేలా చర్యలు ముమ్మరం చేశామన్నారు.బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండేందుకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 24/7 పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. సహాయం కావాల్సిన వారు లేదా వారి బంధువులు హెల్ప్‌లైన్

నెంబర్లు 95500 57623, 79978 26882 లకు ఫోన్ చేయడం ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తమ వివరాలను పంపవచ్చని సూచించారు.విదేశాల్లో ఎక్కడ ఉన్నా సరే, ప్రతి తెలుగు వ్యక్తికి క్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పల్లా శ్రీనివాసరావు పునరుద్ఘాటిం చారు. సంక్షోభ సమయాల్లో వేగంగా స్పందించే సమర్థవంతమైన నాయకత్వం రాష్ట్రానికి ఉందని, బాధితులు ఆందోళన చెందవద్దని ఆయన ధైర్యం చెప్పారు. తెలుగు వారి భద్రత కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటోందని తెలిపారు.

# రాష్ట్రంలో స్త్రీలపై నేరాలు తగ్గుదల

-మొదటిపేజీ తరువాయి

వాటిని నేర్పుగా పరిష్కరించుకునే సామర్థ్యాలను ఆడపిల్లలకు తల్లిదండ్రులు అలవర్చాలి. అదే వారికి ఇచ్చే పెద్ద ఆస్తి' అని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలో సోమవారం ఏపీ పోలీసు ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళల భద్రతా వారోత్సవాలు' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'రాష్ట్రంలో పోక్సో, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులు జైలు నుంచి బయటకు వచ్చినా వారిపై నిఘా కొనసాగుతుంది. తిరిగి వచ్చిన తర్వాత బాధితులను బెదిరిస్తే సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరుస్తాం' అని అనిత హెచ్చరించారు. మహిళా సాధికారత, భద్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ పోలీసుకు సంబంధించిన మహిళా, శిశు భద్రతా విభాగం లోగోను, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించిన మహిళా పోలీసులు కడలి రేవతి, హైమావతి, శైలజ, ఉషారాణిని హోంమంత్రి అనిత సన్మానించారు.

## కృత్రిమ మేధ వినియోగించి.. పాలనలో సమర్ధత పెంచాలి

-మొదటిపేజీ తరువాయి

శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి వినియోగించుకునేలా ఒక విధానాన్ని తీసుకురావాలి. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై తమిళనాడులోని శివకాశి వెళ్లి అధ్యయనం చేయాలి. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్‌స్టేషన్లలో ప్రయాణికులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లకు అవకాశం ఉండకూడదు. అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా.. అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి. ఒకే సమాచారం కోసం ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు' అని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కు పెంచినట్లు వారు తెలిపారు.

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి

-మొదటిపేజీ తరువాయి

కల్పిస్తున్నట్లు తెలిపారు.ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాధితుల కోసం ప్రభుత్వం 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది.

**హెల్ప్‌లైన్ నెంబర్లు:**

ఫోన్: 0863-2340678

వాట్సాప్: 85000 27678

అలాగే helpline@apnrts.com, info@apnrts.com ఈమెయిల్స్ ద్వారా లేదా https://apnrts.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సంప్రదించి తక్షణ సహాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## అమరావతి పనుల్లో ఆలస్యమేంటి?

అమరావతి నిర్మాణ పనుల్లో జాప్యంపై గుత్తేదారు సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ ప్రతినిధులపై పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వైకాపా హయాంలో నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని కృషి చేస్తుంటే.. పనుల్లో జాప్యం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. నాణ్యతతో పాటు ప్రణాళిక ప్రకారం పనులు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఉదయం అమరావతిలో మంత్రి నారాయణ పర్యటించారు. నేలపాడు సమీపంలో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారుల టైప్ 1, 2తో పాటు గ్రూప్ డీ ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న భవన సముదాయాలను పరిశీలించారు. ఈ పనుల్లో జాప్యంపై షాపూర్‌జీ పల్లోంజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వెంటనే పంపించి వేయాలని అధికారులను ఆదేశించారు. పనుల ఆలస్యంపై షాపూర్‌జీ పల్లోంజీ ప్రతినిధులతో పాటు మేనేజ్‌మెంట్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

**వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఇబ్బందులు**

'వైకాపా ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసింది. ఐదేళ్ల పాలనలో గుత్తేదారుల టెండర్లు రద్దు చేయకపోగా నిర్మాణ సామగ్రిని కూడా తీసుకువెళ్లనివ్వలేదు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనులన్నింటినీ టెండర్ల కాలపరిమితి ప్రకారం పూర్తి చేస్తాం. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రైవేట్ సంస్థల నిర్మాణాలు కూడా వేగంగా జరుగుతున్నాయి. రాజధానిలో ఉద్యోగుల కోసం మొత్తం 4,026 గృహాలను నిర్మిస్తున్నాం. ప్రస్తుతం భవనాల లోపల ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్ పనులు చివరి దశకు వచ్చాయి. ట్రంక్ రోడ్లు, ఎల్‌పీఎస్ లేఅవుట్లలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలం నాటికి అండర్‌గ్రౌండ్ విధానంలో నిర్మించాల్సిన పనులు పూర్తి చేస్తాం. మూడేళ్లలో రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేస్తాం' అని పేర్కొన్నారు.

**వైకాపా ప్రభుత్వంలో నా స్థలం కూడా పోయింది**

వైకాపా ప్రభుత్వం తనపైనా కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్‌మెంట్‌లో తన స్థలం కూడా కోల్పోయానన్నారు. 2001లో విజయవాడ సమీపంలోని ఈడుపుగల్లులో తాను కొనుక్కున్న 60 సెంట్ల స్థలం ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్‌మెంట్‌లో ఉందని తెలిపారు. వైకాపా నాయకులు నిరాధారమైన ఆరోపణలతో ఎలైన్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయంటూ తనపై కేసులు పెట్టారన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించి హైకోర్టులో కేసు ఉన్నందున ఆ అంశం గురించి ఎక్కువగా స్పందించనని తెలిపారు.

# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు.

- భూసంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.
- పి జిఆర్.ఎస్ కు-128, రెవెన్యూ క్లినిక్ కు 173- అర్జీలు జిల్లా కలెక్టరు

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 02:** పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం-1, 2 లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, డి ఆర్వో, వై. సత్యన్నారాయణ రావు లు జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా డివిజను, మండల, గ్రామ స్థాయి లలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయి లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారు నికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖ కు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. పి.జి.అర్.ఎస్ లో 128, రెవిన్యూ క్లినిక్ లో 173 అర్జీలు మొత్తం 301 అర్జీలు







స్వీకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.
కార్యక్రమంలో బి జె ఆర్ ఎస్, ఎన్ ఎ ఓ బి, ప్రత్యేక ఉప కలెక్టర్లు మనోరమ, రామ మాణి, సిపిఓ జి. రామారావు, మెప్మా, డి ఆర్డి ఎ, ఐ సి డి ఎస్, గృహ నిర్మాణ పథక సంచాలకులు , కె సరోజినీ, శచి దేవి, సూర్య లక్ష్మి, శ్రీనివాస్, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి.సుదీర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్









**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 02** : జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ఎంపిడిఓ లతో విడియో కాన్ఫరెన్స నిర్వహించారు. ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లతో వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల పురోగతి పై చర్చించారు. ఈ సందర్భంగా జిలా కలెక్టర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా వివిధ మండలాల్లో 10 నుండి 20 ఇండికేటర్ల (సూచికల) ఆధారంగా పనులను సమీక్షించడం జరిగిందని, ఎంపీడీవోలు తమ పనితీరును మరింత మెరుగుపరుచు కోవాలని సూచించారు. వచ్చే సమీక్షా సమయానికి జిల్లా ర్యాంకింగ్‌లో గణనీయ మైన మార్పు ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు: మార్చి 8 న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో మహిళా ఉద్యోగులు, ఏపీఎం ల సమన్వయంతో వేడుకలు జరగాలని, మహిళల పట్ల గౌరవాన్ని చాటేలా ఈ కార్యక్రమాలు ఉండాలని, జిల్లా యంత్రాంగం మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులు, మెటీరియల్ ఎక్స్ పెండిచర్ వినియోగంలో ఎటువంటి జాప్యం జరగకూడదని, వచ్చే 27 రోజుల్లోగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జిల్లాలో అక్షర ఆంధ్ర కార్యక్రమం కింద 97% అటెండెన్స్ నమోదు కావడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులను చదువు వైపు మళ్లించడంలో కృషి చేస్తున్న ఎంపీడీవోలు, ఏపీఎంలను అభినందించారు. ఇదే ఉత్సాహంతో మరో పది రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు.

వచ్చే వారం నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిమిత్తం జిల్లాలో ఏర్పాటు చేసిన 108 పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు పకడ్బందీగా ఉండాలన్నారు. పోలీసుల ద్వారా భద్రతను పర్యవేక్షించాలని, పరీక్షల సమయంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా నిశితంగా గమనించాలని ఎంఆర్వో ఎంపీడీవోలకు సూచించారు.

ఈ సమావేశంలో గృహ నిర్మాణ పి డి శ్రీనివాస్, డి ఆర్డి ఎ, డ్వామా పీడీ లు శచి దేవి, పూర్ణిమ దేవి, డిపిఓ సందీప్, జిల్లా జి ఎస్ డబ్ల్యూ ఎస్ సమన్వయ అధికారి మంజుల వాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నూకాంబిక అమ్మవారి జాతర చాటింపు



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 02:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జాతర చాటింపు నిర్వహించారు. సోమవారం నూకాంబిక అమ్మవారి దేవస్థానం నుండ అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ భీమరిశెట్టి రామకృష్ణ (రామ్ కి)
ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ జాతర చాటింపు కార్యక్రమం ప్రారంభించారు.
ఈ నెల 17,18 తేదీల్లో జరగబోవు జాతర, కొత్త అమావాస్య సందర్భంగా పండగ చాటింపు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, రా ష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర, ఆలయ ధర్మకర్తలు
సూరే సతీష్, దాడి రవికుమార్
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్రాజెక్ట్ భూమి పూజకు వేగవంత మైన ఏర్పాట్లు



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 02:** అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పోన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) సంస్థ స్థాపిస్తున్న భారీ ఉక్కు ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూమి పూజ కార్యక్రమం కోసం ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం 2,200 ఎకరాల భూమిని కేటాయించినట్లు అధికారులు తెలిపారు.
సోమవారం ఉదయం సంస్థ ప్రతినిధులు ప్రాజెక్ట్ స్థలాన్ని సందర్శించి ప్రారంభ పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం, రాబోయే భూమి పూజ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పై చర్చించేందుకు వారు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను కలిశారు. ఈ సమావేశంలో ఏఎంఎన్ఎస్ సీఈఓ దిలీప్ ఓమెన్ ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పునరావాసం, పునరావాస పథకాల (ఆర్&ఆర్) అమలు, పురోగతి పై అత్యంత సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రాజెక్ట్ కు సంబంధించిన కీలక అంశాల పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. భూ సమీకరణ, పునరావాస కాలనీల అభివృద్ధి, ప్రభావిత కుటుంబాల సురక్షిత తరలింపు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, ప్రాజెక్ట్ కు అవసర మైన నీటి సరఫరా కోసం పైప్‌లైన్ల ఏర్పాటు వంటి అంశాల పై సమీక్షించారు.
ప్రాజెక్ట్ కు సంబంధించిన అన్ని పనులు కచ్చితంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసర మైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఏఎంఎన్ఎస్ సీఈఓ దిలీప్ ఓమెన్, ప్రాజెక్ట్ చీఫ్ కేఎల్ చౌదరి, హెచ్ఆర్ డైరెక్టర్ అశితోష్ తెలియాంగ్, అడ్మిన్ హెడ్ కెప్టెన్ దీపక్ పట్నాయక్, హెచ్ఆర్ అడ్మిన్ డి.ఎస్. వర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత వారోత్సవాలు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు.
జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు.
మహిళల భద్రత - పోలీసుల పాత్ర అంశం పై విద్యార్థుల ప్రతిభ.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 02:** మహిళా సాధికారత వారోత్సవాలను పురస్కరించుకుని, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. జిల్లా లోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పాఠశాలల్లో మహిళలు, బాలికల పై జరుగుతున్న అఘాయిత్యాల నియంత్రణలో పోలీసుల పాత్ర అనే అంశం పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం (డ్రాయింగ్) పోటీలు జరిగాయి.
విద్యార్థుల్లో మహిళల భద్రత, హక్కుల పరి రక్షణ, వారి పట్ల గౌరవాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. సమాజంలో మహిళా రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను యువతకు వివరించడం ద్వారా వారిలో చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం చట్టాల అమలుతో పాటు అవగాహన కార్యక్రమాలు




నిర్వహిస్తున్నామని తెలిపారు.
శక్తి టీమ్స్, మహిళా హెల్ప్‌లైన్ నంబర్లు మరియు సైబర్ భద్రత పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.
అఘాయిత్యాలను అడ్డు కోవడంలో పోలీసు శాఖ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. ఈ



పోటీల్లో విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రసంగాలు, వ్యాసాలు, రంగు రంగుల చిత్రాల ద్వారా మహిళా భద్రత యొక్క ఆవశ్యకతను చాటిచెప్పారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, వేధింపులు, సైబర్ నేరాల పట్ల సమాజం ఎలా అప్రమత్తంగా ఉండాలో విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది.

## కళాకారుల సమస్యలపై కలెక్టర్‌కు మెమొరాండం..




**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, పెన్ సత్తా, మార్చి 02** :తెలంగాణ ప్రజానాట్యమండలి రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డిను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై మెమొరాండం అందజేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో మెమొరాండాలు సమర్పిస్తున్న నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా సమితి అధ్యక్ష, కార్యదర్శుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణలో ప్రజా కళాకారులు నిరంతరం ప్రజల కోసం వివిధ సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శిస్తూ సామాజిక సమస్యలపై పోరాటం సాగిస్తున్నారని ప్రతినిధులు పేర్కొన్నారు. అయితే కళారంగంలో ఉన్న అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కళాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని, క్రీడాకారులకు ఉన్న స్పోర్ట్స్ కోట తరహాలో కళాకారులకు కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో సాంస్కృతిక కోట కింద అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రతి కళాకారునికి వైద్య సదుపాయాల కోసం హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డు ద్వారా ప్రభుత్వ రాయితీలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కళాకారుల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని, రాష్ట్ర సాంస్కృతిక రంగ వికాసం కోసం సమగ్ర సాంస్కృతిక విధానం వెంటనే ప్రకటించాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో సాంస్కృతిక మండలాలను ఏర్పాటు చేసి నిజమైన కళాకారులకు ప్రాతినిధ్యం కల్పించి వాటిని సజీవం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి. వేణుగోపాల చారి, జిల్లా అధ్యక్షులు కూన సుధాకర్, జిల్లా సహాయ కార్యదర్శి ముచ్చపోతు రాము, సమితి సభ్యులు వీరమల్ల విజయ్, ఆకారం వెంకన్న, దాదిమల్ల నారాయణ, ఆమనగంటి లింగం, శైలజ, మంగ తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌పై ఉక్కుపాదండ 164 కేజీల గంజాయి స్వాధీనం..

అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ ఖరీదైన కారుతో స్మగ్లింగ్ యత్నం భగ్నం..
ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనురాధ..




**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, పెన్ సత్తా, మార్చి 02** :మల్కాజ్‌గిరి కమీషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎస్‌ఓటీ, అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఈ ముఠాకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారండ ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన నభిన్ సభర్, సుద్కర్ మండల్ అనే ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి భారీగా గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు కీయా కారును వినియోగించారు. అబ్దుల్లాపూర్మెట్ సమీపంలోని ఓఆర్ఆర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కీయా కారును ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో కారులో రహస్యంగా దాచిన 164 కేజీల గంజాయి బయటపడింది. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి, హైదరాబాద్ మీదుగా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు తరలించి విక్రయించాలని యత్నించినట్లు తేలింది. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ఖరీదైన కార్లను వినియోగిస్తూ ఓఆర్ఆర్ మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనురాధ తెలిపారు. ఈ నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర వ్యక్తుల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# వైభవంగా ఉపమాక వెంకన్న తోట ఉత్సవం






**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 02 :** ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా స్వామివారి తోట ఉత్సవం ( వన విహారయాత్ర ) వైభవంగా జరిగింది. సోమవారం ఉపమాక శివారు గ్రామమైన సారిపల్లి వాని పాలెం సమీపంలోనే తోటలో ఉన్న స్వామివారి మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు అట్టహాసంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధి నుండి రాజాధిరాజ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామిని భాజా బజంత్రీల తో మండప వద్దకు తీసుకువచ్చారు. వందలాదిమంది భక్తుల మధ్య స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యా వచనం, మండప శు ద్ధి ప్రసాద్ నివేదన, హారతి వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి కళ్యాణం అనంతరం నాలుగవ రోజు ఆలయానికి సుమారు మూడు



కిలోమీటర్ల దూరంలో ఉన్న మండపం వద్దకు విహారయాత్రకు తీసుకెళ్లి స్వామివారికి తోట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఉత్సవంలో అనేకమంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# వెంకన్న సన్నిధిలో అలరించిన అన్నమయ్య కీర్తనలు




**నక్కపల్లి, పెన్ సత్తా :** ఉపమాక శ్రీ కలికి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. సోమవారం విజయనగరానికి చెందిన షణ్ముఖ ప్రియా, సాహితీ ప్రియా ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కచేరిలో రవికుమార్ మృదంగం, వయోలిన్ వీరు సమకూర్చారు. వీరి కీర్తనలకు ఆలయ అధికారులు ఉరుమేశ్వరరావు పలువురు భక్తులు అభినందించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

# రక్షణ సైన్యం సమాధుల తోటను పరిరక్షించండి

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజుకు వినతి పత్రం అందజేసిన వి ఏసుపాదం

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 2:**బాపట్ల పట్టణం జీబీసీ రోడ్డులో ఉన్న రక్షణ సైన్యం ఐటీఐ కళాశాల ప్రక్కన ఉన్నటువంటి సమాధుల తోటలో రైల్వే శాఖ వారు ఎలక్ట్రికల్ ట్రాన్సఫర్మర్ సిస్టం అప్ గ్రేడింగ్ నిర్మాణం చేయడానికి సమాధుల తోటను తమకు ఇవ్వవలసిందిగా నోటీసులు పంపించడంతో సోమవారం బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజును కలిసి రక్షణ సైన్యం బాపట్ల మండల నాయకులు వి ఏసుపాదం మాట్లాడుతూ.....గతకొన్ని సంవత్సరాలుగా పట్టణ పరిధిలోని రక్షణ సైన్యం సంస్థలో సంగస్థులు మరణించినప్పుడు ఆ ప్రదేశానికి తీసుకువచ్చి భూస్థాపితం చేయడం జరుగుతుందని తెలిపారు.అలాగే సమాధుల తోట పక్కనే టీస్పోట్ సన్ రైజ్ చిన్న పిల్లల పాఠశాల నిర్వహించడం జరుగుతుందని,ఆ ప్రాంతంలో హై టెన్షన్ విద్యుత్ తీగలు ఉండడం వల్ల చిన్న పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు.సమాధుల తోటలో ఇటువంటి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం చేయడానికి రైల్వే శాఖ వారు నోటీసులు పంపించారని ఇదే విషయాన్ని శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజుకి వివరించడం జరిగిందని మేజర్ ఏసుపాదం తెలిపారు.క్రైస్తవుల ప్రజల మరణం అనంతరం సమాధుల తోటలో జ్ఞాపకాలుగా నిర్మించుకొనే సమాధులకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా అధికార యంత్రాంగంతో




మాట్లాడతానని శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు సానుకూలంగా స్పందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గేరా బెనర్జీ మీనన్,డాక్టర్ కాగిత వరప్రసాద్,పల్లం జీవన్,కోపూరి రత్న ప్రసాద్,దాసరి శ్యాం లివింగ్ స్టన్,జోగి సుధీర్ బాబు,గేరా మణి భూషణ్,మాతంగి ఏసుపాదం,మార్పు ఆనంద్,తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ మరియు రక్షణ సైన్యం సేవకులు పాల్గొన్నారు.

# ఏన్కూర్ మండలంలో ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయించాలి

## అధ్యక్షులు సందీప్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేసిన ప్రెస్ క్లబ్ సభ్యులు

**పెన్ సత్తా, మార్చి 02** :ఏన్కూర్ మండలంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ ఈరోజు మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) సిహెచ్ శేషగిరిరావు కు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దిరావత్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు కలిసి ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించి ఈ వినతి పత్రాన్ని అందజేశారు. మండల పరిధిలో పనిచేస్తున్న పత్రికా విలేకరులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నారని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పరిస్థితులను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.అయితే, మండల కేంద్రంలో జర్నలిస్టులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, అధికారులతో సమన్వయం చేసుకోవడానికి మరియు ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతి పత్రంలో వివరించారు. ముఖ్యంగా అత్యవసర సమావేశాలు నిర్వహించుకోవడం, వార్తా చర్చలు, పత్రికా సమావేశాలు నిర్వహించడానికి సరైన వేదిక లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.
మండలంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు ద్వారా జర్నలిస్టులు మరింత సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించి ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో కూడా ప్రెస్ క్లబ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని వివరించారు.కాబట్టి, మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం తగిన ప్రభుత్వ భూమిని కేటాయించి జర్నలిస్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా ఎమ్మార్వో ని కోరారు.
ఈ సందర్భంగా ఎమ్మార్వో వినతి పత్రాన్ని స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, పత్రికా విలేకరులు మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా నేడు పెద్దమ్మ గుడి మూసివేత




**భద్రాద్రి కొత్తగూడెం పెన్ సత్తా, మార్చి 02** : పాల్వంచ మండలం, కేశవాపురం జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) మంగళవారం చంద్రగ్రహణం ను పురస్కరించుకొని ఉదయం 7.30 గం,,లకు అమ్మవారికి, శ్రీ స్వామివార్లకు మహానివేదన అనంతరం ద్వార బంధనం చేసి తిరిగి మరుసటిరోజు బుధవారం రోజున ఆలయ సంప్రోక్షణ, ప్రాత:కాలపూజలు నిర్వహించి ఉదయం 7.00 గం,,ల నుండి భక్తులకు అమ్మవారి, శ్రీ స్వామివారి దర్శనం కల్పించబడును అని ఆలయ ఈవో ఒక ప్రకటన తెలిపారు.

## జిఎంకు మెమోరాండం ఇచ్చిన కాపుకృష్ణ



**కొత్తగూడెం పెన్ సత్తా, మార్చి 02** : :జె.వి.ఆర్ మరియు కిష్టారాశీ ఓసీలలో డిప్యూటేషన్ పై చేస్తున్న ఈపి ఆపరేటర్స్ మరియు అన్ని డిజిగ్నేషన్ల ఉద్యోగులను వికే సీఎంకు తీసుకురావాలని,గతంలో కొత్తగూడెం ఏరియా లోని జీకే ఓసి వికే సీఎం ఓపెన్ అయ్యేంతవరకు జేవిఆర్, కిష్టారం ఓసీలకు ఈపి ఆపరేటర్స్ మరియు ఇతర డెసిగ్నేషన్ల ఉద్యోగులను డిప్యూటేషన్ పై పంపించడం జరిగింది. వికేసి ఎం ఓపెన్ అయిన సందర్భంగా డిప్యూటేషన్ పై ఉన్న వారందరినీ వీకేసీఎంకు మరల అందరిని సీనియార్టీ ప్రకారం పిలిపించగలరని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తరుపున మెమోరండం ఇచ్చారు .ఈ కార్యక్రమంలో గడప రాజయ్య వైస్ ప్రెసిడెంట్, సెంట్రల్ కమిటీ మెంబర్స్ విజయ్ కుమార్, మాదాసి ఈశ్వర్ బోరింగ్ శంకర్, బూర్గుల రవికుమార్, తిరుపతయ్య, శేఖర్ రెడ్డి, ఓం ప్రకాష్, అశోక్, జోసఫ్, లక్ష్మణ్, రాజీరు తదితరులు పాల్గొన్నారు.

## నేడే డయల్ యువర్ డిఎం



**పెన్ సత్తా, మార్చి 02** :సికింద్రాబాద్ పరిసర ప్రాంత ప్రజలకు తెలియజేయునది ఏమనగా తేదీ 3 మంగళవారం రోజున మధ్యాహ్నం 3:00 గంటల నుండి 4:00గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్ రావు ప్రకటనలో తెలియజేశారు. కావున ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు సూచనలు మరియు ఫిర్యాదులను మా దృష్టికి తీసుకురావాలనీ, అలాగే మా సేవలను అభివృద్ధి పరచుకునే అవకాశం కల్పించగలరని కోరారు. ఈ సందర్భంగా ఎవరైనా సలహాలు సూచనలు ఇవ్వదలచినచో ఈ క్రింద ఉన్న నెంబర్ కు 9959226143 సంప్రదించవలెనని కోరారు.

## బయ్యారం మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన జేపీసీ

**పెన్ సత్తా, మార్చి 02** :మహబూబాబాద్ జిల్లా బయ్యారం:....బయ్యారం మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ బయ్యారం నియోజకవర్గం సాధన కమిటీ (జేఏసీ )ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు.

వివిధ రూపాల్లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు జేఏసీ విజ్ఞప్తి చేస్తూ వస్తుంది.అందులో భాగంగానే సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కు వినతి పత్రం అందించినట్లు జెఏసి చైర్మన్ బానోతు చందర్ నాయక్ తెలిపారు.గార్ల,బయ్యారం,గంగారం,కొత్తగూడ మండలాలను కలపుతూ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని 2026-28 మధ్యలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో బయ్యారాన్ని ప్రత్యేకంగా గుర్తించి నియోజక వర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు.

ఆంధ్ర,తెలంగాణ విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా బయ్యారంలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు ప్రక్రియను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రక్కకు పెట్టాయని, కనీసం ఇప్పుడైనా బయ్యారంను గుర్తించి నియోజకవర్గంగా చేయాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం నియోజకవర్గం సాధన కమిటీ చైర్మన్ బానోతు చందర్ నాయక్, కన్వీనర్ వర్ప ప్రకాష్ దొర,



జేఏసి నాయకులు మద్దినేని గుట్టయ్య యాదవ్, కొమిరె సాకీ, తమ్మిశెట్టి రాందాస్,భూక్య రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 13వ విడత అన్నదాన కార్యక్రమం



**ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలి**

**టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని డిమాండ్**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెన్ సత్తా, మార్చి 02** : ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 13వ విడత అన్నదాన కార్యక్రమం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సరం కానుకగా రైతు భరోసా నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, మరోసారి సంక్రాంతి కానుకగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని చెప్పారని, మూడోసారి పురపాలక ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిధులు విడుదల చేస్తామని చెప్పిన హామీలన్నీ బుట్ట దాఖలు అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం కోసం ఇచ్చే రైతు భరోసా సమయానికి రాకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చి సాగు చేస్తున్నారని తెలిపారు. దీనివలన రైతులు అప్పులపాలై ప్రాణాల మీదికి తెచ్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను ఏడవ తారీకు లోపు విడుదల చేయాలని లేనియెడల ప్రజా సంఘాలు రైతు సంఘాల తో కలిసి ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్ లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణికి 153 దరఖాస్తులు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెన్ సత్తా, మార్చి 02** :ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ (ఇంఛార్జి) చంద్రావతి లతో కలిసి అదనపు కలెక్టరు (153) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (53) దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో



ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు.అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్లపై ఆక్రమణలు

**ఎల్‌బీనగర్‌హయత్‌నగర్ మార్గంలో ట్రాఫిక్ కష్టాలు..**

**హయత్ నగర్ డివిజన్ బీజేవైఎం మాజీ అధ్యక్షులు ఎర్ర ప్రేమ్..**

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, పెన్ సత్తా, మార్చి 02** :ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వైపు వెళ్లే జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై అనధికారిక పండ్ల బండ్లు ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నాయి. ఆటోనగర్ నుంచి భాగ్యాలత వరకు దాదాపు 1 నుంచి 1.5 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు పక్కనే బండ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం ప్రతిరోజూ రద్దీగా ఉండే ప్రధాన రహదారి కావడంతో వాహనాలు సజావుగా సాగలేక తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, కార్లు మరియు పాదచారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఎప్పుడైనా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులు,



జిహెచ్ఎంసి అధికారులు తక్షణ చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్లను ఆక్రమణల నుంచి విముక్తం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి ట్రాఫిక్ సజావుగా నడిచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన జగ్గుతండ సర్పంచ్.



**. మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెన్ సత్తా, మార్చి 02** :.బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీలోని బీసీ కాలనీలో గల అంగన్వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ సందర్శించారు.దీనిలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని,తల్లీపిల్లల ఆరోగ్య సూచికలను అంగన్వాడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ జయంతి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో తల్లి పిల్లల క్షేమం కోసం మంచి పౌష్టిక ఆహారం అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు వార్డు సభ్యులు మక్కల దుర్గారావు,స్థానిక ఏఎన్ఎం సమ్మక్క,ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది,పిల్లలు,గర్భిణీలు,తల్లులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత..

**భువనగిరి మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్..**



**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, పెన్ సత్తా, మార్చి 02** :తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తమ సత్తా చాటుతుందని మాజీ భువనగిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నరసయ్య గౌడ్ అన్నారు. సోమవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని బొంగులూరు గేట్ కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పలువురు ప్రముఖులు హాజరై పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, ప్రత్యేక బహుమతులు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. తనపై ప్రేమాభిమానాలతో శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. గడిచిన రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ తెలంగాణలో మెజార్టీ స్థానాలు గెలుచుకొని కాషాయం జెండా ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయిని సత్యనారాయణ, ముత్యాల మహేందర్, ఆడెపు రాఘవేంద్ర స్వామి, పోరెడ్డి అర్జున్ రెడ్డి, ఎన్నో యాదగిరి రెడ్డి, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాత్ రూమ్‌లో ఈ వస్తువులు ఉంటే.. దురదృష్టం వెంటాడినట్టే!



వాస్తు నియమాలను అనుసరించి ఇల్లు కట్టుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. వీటి వల్ల మీకు అదృష్టం వెతుక్కుంటు మరీ వస్తుందని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతూ ఉంటారు. అంతే కొన్ని ప్రదేశాల్లో కొన్ని వస్తువులను కూడా పెట్టకూడదంటారు. దాని వల్ల ఇంట్లో నెగిటివ్ ఎనర్జీ పెరుగుతుంది. దీని వల్ల అనేక ఇబ్బందలను ఎదుర్కొనాల్సి వస్తుంది. దీని వల్ల కుటుంబంలో ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడటం, గొడవలు, తగాదాలు వంటివి నెలకొంటి. ఇవే వాస్తు నియమాలు బాత్ రూమ్ లో కూడా వర్తిస్తాయి. బాత్ రూమ్ లో ఉండే వస్తువుల విషయంలో సరైన జాగ్రత్తలు పాటించాలి. వీటి వల్ల కూడా నెగిటివ్, పాజిటివ్ ఎనర్జీల ఎఫెక్ట్ పడతాయి. అసలు బాత్ రూమ్ లో ఎలాంటి వస్తువులు ఉండాలి? ఎలాంటి వస్తువులు ఉండకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.అద్దాలు:బాత్ రూమ్ లో పెట్టే అద్దాల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలా మంది బాత్ రూమ్ లో అద్దాలను పెట్టు కుంటారు. వీటి వల్ల నష్టాలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. అలాగే బాత్ రూమ్ లో ఉండే అద్దం ఎప్పుడూ విరిగి పోయి ఉండకూడదు. ఒక వేళ ఉంటే వెంటనే దాన్ని పారేయాలి. లేకుంటే ప్రతి కూలతలను సృష్టిస్తాయి.బకెట్లు: బాత్ రూమ్ లో ఉండే బకెట్లు ఎప్పుడూ ఖాళీగా ఉండకూదట. ఒక వేళ ఖాళీ బకెట్ ఉంటే దాన్ని బోర్లించి పెట్టాలి. బాత్ రూమ్ లో ఖాళీ బకెట్ ఉంటే.. అది ఇంట్లో ఉండే డబ్బులను ఖాళీ చేస్తుంది. అలాగే విరిగి పోయిన, పగిలిన బకెట్లు కూడా ఉండకుండా చూసుకోండి.మొక్కలు– చిత్రాలు: చాలా మంది ఇప్పుడు బాత్ రూమ్ లో మొక్కలను కూడా పెడుతున్నారు. బాత్ రూమ్ లో మొక్కలను పెట్టడం అసలు ఏమాత్రం మంచిది కాదని వాస్తు శాస్త్ర నిపుణులు అంటున్నారు. అలాగే ఎండి పోయిన మొక్కలు ఉంటే వెంటనే వాటిని తొలగించాలి. అదే విధంగా డెకరేషన్ కోసం బాత్ రూమ్ లో చిత్రాలను కూడా పెడుతూ ఉంటారు. ఇవి చినిగి పోయి ఉంటే వాటిని పారేయాలి.ట్యాప్ లీక్ అవ్వకూడదు: బాత్ రూమ్ లో ఎప్పుడూ ట్యాప్ లీక్ కాకుండా చూసుకోండి. ఇలా లీక్ అవ్వడం వల్ల ప్రతికూల శక్తిని వ్యాపింప చేస్తుంది. అంతే కాకుండా ఆర్థిక పరిస్థిపై చెడు ప్రభావం పడుతుంది.

## స్టాక్ మార్కెట్లో రక్తపాతం.. భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. ఆ స్టాక్స్ లాభాల్లోకి..




దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం తమ ప్రయాణాన్ని నష్టాలతో స్టార్ట్ చేశాయి. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఇప్పుడు అనేక మధ్యప్రాశ్చ దేశాలతో పాటు యూరోపియన్ దేశాలకు కూడా విస్తరించటంతో ఇన్వెస్టర్లలో భయాలు భారీగా పెరిగిపోయాయి. దీంతో మధ్యాహ్నం సమయానికి కీలక సూచీలు ఊహించని స్థాయిలకు దిగజారాయి. మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ 1450 పాయింట్ల నష్టంతో కొనసాగుతుండగా.. మరో కీలక సూచీ నిఫ్టీ 443 పాయింట్లు కోల్పోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ సూచీ 1500 పాయింట్లకు పైగా కోల్పోయి ముందుకు సాగుతోంది. ఇక బ్యాంక్ నిఫ్టీ , నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీలు కూడా భారీగానే నష్టాలతో ముందుకు సాగుతున్నాయి. యుద్ధం వేళ మార్కెట్లో ట్రావెల్ అండ్ టూరిజం పరిశ్రమకు చెందిన షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఇండిగో, ఇక్సిగో, ఆర్వీఎన్ఎల్, విమానయానం, హోటల్స్, టూరిజం కంపెనీల షేర్లు పతనం అయ్యాయి. ఈ క్రమంలో మార్కెట్లో ఎల్ అండ్ టి, ఇండిగో, అదానీ పోర్ట్స్ కంపెనీల షేర్లు ఇంట్రాడేలో భారీ నష్టాలను నమోదు చేశాయి. ఇదే క్రమంలో డిఫెన్స్ రంగానికి చెందిన కంపెనీల షేర్లు ఒక్కసారిగా లాభపడ్డాయి. నిఫ్టీ డిఫెన్స్ 2 శాతం మేర లాభపడింది. భెల్, పరాస్ డిఫెన్స్ సహా మరిన్ని కంపెనీలు లాభపడ్డాయి.

## సౌదీ పెట్రోల్ బావులపై ఇరాన్ బాంబుల వర్షం.. సౌదీ అరాంకో రిఫైనరీ మూసివేత!

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసే 'చమురు' క్షేత్రాలకు పాకాయి. ఇరాన్ తన సుప్రీం లీడర్ మృతికి ప్రతీకారంగా సౌదీ అరేబియా ఆర్థిక మూలాలను దెబ్బతీసే పనిలో పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనరీలలో ఒకటిగా పేరుగాంచిన సౌదీ అరంకోకు చెందిన రాస్ తనురా(ఝం ఖఅబతీఖ) పై ఇరాన్ డ్రోన్ల వర్షం కురిపించడం సంచలనంగా మారింది.

సౌదీ అరేబియాకు వెన్నెముక అయిన సౌదీ అరాంకో రిఫైనరీపై ఇరాన్ తన అత్యంత ప్రమాదకరమైన షాహెద్–136 డ్రోన్లతో విరుచుకుపడింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో రాస్ తనురా రిఫైనరీలో భారీ మంటలు చెలరేగాయి. ఇది కేవలం సైనిక దాడి మాత్రమే కాదు, ప్రపంచ చమురు సరఫరాను స్తంభింపజేసి, ప్రపంచ దేశాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే అంశంగా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడితో భద్రతా కారణాల దృష్ట్యా సౌదీ అరేబియా తన రాస్ తనురా రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసింది. ప్రపంచ మార్కెట్లకు ప్రతిరోజూ లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేసే ఈ కేంద్రం మూతపడటం అంటే.. గ్లోబల్ ఎకానమీపై పిడుగు పడ్డట్లేనని చెప్పుకోవాలి. దీంతో క్రూడ్ ఆయిల్ మార్కెట్‌ను గత కొన్ని దశాబ్దాలలో ఎన్నడూ లేనంత పెద్ద సంక్షోభంలోకి నెట్టివేసింది. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ, జరిగిన నష్టం, భవిష్యత్తులో జరిగే దాడుల భయంతో మార్కెట్లు వణికిపోతున్నాయి.ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ఇప్పుడు గల్ఫ్ దేశాల ఇంధన వనరులను లక్ష్యంగా చేసుకుంటోంది. సౌదీపై జరిగిన ఈ దాడి వల్ల ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద దెబ్బ, ఎందుకంటే మనం ఇంధన అవసరాల కోసం క్రూడ్ గల్ఫ్ దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంటాం కాబట్టి.తాజా దాడి తర్వాత సౌదీ అధికారులు ప్రస్తుతం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు, అమెరికా సహకారంతో ప్రతిదాడికి సిద్ధమవుతున్నారు. ఒకవేళ ఈ దాడులు ఇలాగే కొనసాగితే.. అది కేవలం పశ్చిమాసియాకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కొత్త ట్రెండ్: ల్యాబ్ గోల్డ్ అంటే ఏమిటి? తవ్వితీసిన బంగారానికి దీనికి మధ్య తేడా ఏంటంటే..?

ల్యాబ్–గ్రోన్ డైమండ్స్ గురించి మనం విన్నాం. కానీ ఇప్పుడు ల్యాబ్–గ్రోన్ గోల్డ్ వంతు వచ్చింది. ఆభరణాల మార్కెట్‌లో ఈ సరికొత్త ఆవిష్కరణ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు ల్యాబ్‌లో బంగారం తయారవ్వడం ఏమిటి? అది నిజమైన బంగారమేనా? దాని భవిష్యత్తు ఎలా ఉంటుంది? వంటి ఆసక్తికర విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం..



**ల్యాబ్–గ్రోన్ గోల్డ్ అంటే ఏమిటి?**

సాధారణంగా బంగారాన్ని గనుల నుండి వెలికితీస్తారు. కానీ ల్యాబ్–గ్రోన్ గోల్డ్ అనేది అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగశాలల్లో తయారవుతుంది. ఇది కేవలం బంగారు పూత లేదా నకిలీ బంగారం కాదు. రసాయనిక, భౌతిక ధర్మాల పరంగా ఇది గనుల నుండి తీసిన బంగారంతో 100% సమానం. ఈజీగా అర్థమయ్యేలా చెప్పాలంటే.. భూమి పొరల్లో వేల ఏళ్లలో జరిగే ప్రక్రియను శాస్త్రవేత్తలు నియంత్రిత వాతావరణంలో తక్కువ సమయంలోనే పూర్తి చేస్తారన్నమాట.

ప్రస్తుతం ల్యాబ్ గోల్డ్ తయారీలో రెండు పద్ధతులు ప్రధానంగా ఉన్నాయి:

అణు స్థాయి సాంకేతికత: బంగారం పరమాణువులను ఉపయోగించి నేరుగా బంగారాన్ని నిర్మించడం. ఇది చాలా ఖరీదైన ప్రక్రియ.రీసైకిల్డ్ గోల్డ్ పద్ధతి: పాత బంగారాన్ని సేకరించి, ల్యాబ్‌లో అత్యున్నత స్థాయి శుద్ధి ప్రక్రియ ద్వారా అతి స్వచ్ఛమైన బంగారంగా మార్చడం. ప్రస్తుతం ఈ సాంకేతికత ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది.

సాంప్రదాయక మైనింగ్ వల్ల పర్యావరణానికి భారీ నష్టం జరుగుతుంది. ఒక చిన్న ఉంగరానికి సరిపడా బంగారం తీయడానికి టన్నుల కొద్దీ భూమిని తవ్వాలి. అలాగే పాదరసం, సైనేడ్ వంటి ప్రమాదకర రసాయనాలను వాడాలి. ల్యాబ్–గ్రోన్ గోల్డ్ ఈ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. తక్కువ నీరు, తక్కువ భూమిని వాడి పర్యావరణానికి హాని లేకుండా దీనిని తయారు చేయవచ్చు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చే నేటి యువతకు ఇది మంచి ప్రత్యామ్నాయం అని చెప్పుకోవచ్చు.చాలామంది ల్యాబ్ గోల్డ్ అంటే తక్కువ ధర ఉంటుందని భావిస్తారు. కానీ ప్రస్తుతం దీని తయారీకి వాడే హై–టెక్ టెక్నాలజీ, పరికరాల వల్ల దీని ధర మైనింగ్ బంగారంతో దాదాపు సమానంగానే ఉందట. భవిష్యత్తులో ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇక రీసేల్ విషయానికి వస్తే.. దీని స్వచ్ఛత మైనింగ్ బంగారంతో సమానంగా ఉంటే, మార్కెట్ ధర ప్రకారం దీనికి కూడా అదే విలువ లభిస్తుంది. అయితే ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రావడానికి కొంత సమయం పట్టవచ్చు.

దేశంలో బంగారం అంటే ప్రజలకు కేవలం ఒక లోహం కాదు. అది ఒక సెంటిమెంట్. పెళ్లిళ్లు, పండుగలు, పూజల్లో సహజసిద్ధమైన బంగారానికే ప్రాధాన్యత ఇస్తారు. ల్యాబ్–గ్రోన్ గోల్డ్ ఎంత స్వచ్ఛమైనదైనా.. వేల ఏళ్ల నాటి నమ్మకాన్ని, సెంటిమెంట్‌ను గెలుచుకోవడం ఈ కొత్త టెక్నాలజీకి అతిపెద్ద సవాల్. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆధునికతను అంగీకరించే వారు దీని వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో ల్యాబ్–గ్రోన్ గోల్డ్ అనేది మైనింగ్ బంగారాన్ని పూర్తిగా భర్తీ చేయకపోవచ్చు. కానీ ఇది ఒక కొత్త అధ్యాయానికి నాందిగా చెప్పుకోవచ్చు. నాణ్యతలో స్థిరత్వం, పర్యావరణ స్పృహ, నూతన డిజైన్లకు ఇది వేదికగా మారుతోంది. రాబోయే కాలంలో ఇది కేవలం పెట్టుబడిగా మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన ఫ్యాషన్ ఐకాన్‌గా మారే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అయితే దీనిని భారతీయులు ఎంత వరకూ స్వీకరిస్తారు అనేది వేచి చూడాల్సిన ప్రశ్న అనే చెప్పుకోవాలి.

# యుద్ధం వేళ భారీగా తగ్గిన గోల్డ్.. కేజీకి రూ.35వేలు పెరిగిన వెండి.. హైదరాబాద్ రేట్లివే..

ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం వేళ విలువైన లోహాలు అనూహ్యంగా స్పందిస్తున్నాయి. ఈ క్రమంలో అందరినీ ఆశ్చర్య పరుస్తున్న విషయం గోల్డ్ రేట్ల పతనమే. వాస్తవానికి రేట్లు భారీగా పెరుగుతాయ్ అని కొనుగోలుదారులు బయటపడుతున్న వేళ తగ్గుదల ఊరటను కలిగిస్తోంది. ఇదే క్రమంలో వెండి మాత్రం దూసుకుపోతోంది. షాపింగ్ చేయాలని అనుకుంటున్న వ్యక్తులు ముందుగా తమ ప్రాంతంలో తగ్గిన రిటైల్ రేట్లను గమనించటం మంచిది.



మార్చి 2న బంగారం రేట్లు భారీగా తగ్గి ఊరటను కలిగిస్తున్నాయి. దీంతో మార్చి 1 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.329 తగ్గింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.16వేల 980గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.15వేల 565గా తెలుగు రాష్ట్రాల్లోని నగరాల్లో కొనసాగుతోంది. ఇక వెండి విషయానికి వస్తే మార్చి 2, 2026న రేటు కేజీకి రూ.35వేలు పెరిగింది దేశవ్యాప్తంగా. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు రూ.3లక్షల 15వేలకు చేరుకుంది. అంటే గ్రాము ధర రూ.315 వద్ద ఉంది.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్.. నిపుణుల సూచన ఇదే

శనివారం ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ స్టార్ట్ చేసిన యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఇరాన్ అనేక మిడిల్ ఈస్ట్ దేశాల్లోని యూఎస్ మిలిటరీ స్థావరాలపై దాడులు స్టార్ట్ చేయటంతో పరిస్థితులు దిగజారుతున్నాయి. ఈ ప్రభావం సోమవారం భారత స్టాక్ మార్కెట్లపై భారీగా పడింది. మార్కెట్లు స్టార్ట్ అయిన కొద్దిసేపట్లోనే బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా నష్టాల్లోకి జారుకుంది.



ఉదయం 9.48 గంటల సమయంలో మార్కెట్ సూచీ సెన్సెక్స్ 735 పాయింట్ల నష్టంతో కొనసాగుతుండగా.. మరో కీలక సూచీ నిఫ్టీ 225 పాయింట్లను కోల్పోయింది. ఇదే క్రమంలో బ్యాంక్ నిఫ్టీ సూచీ 475 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 390 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ కొనసాగిస్తోంది. ఇదే క్రమంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని క్లోజ్ చేయటంతో ఒక్కసారిగా క్రూడ్ ఆయిల్ రేట్లు అంతర్జాతీయ మార్కెట్లలో పెరగటం స్టార్ట్ చేశాయి. పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాలు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ప్రధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతికి దారితీసిన ఇజ్రాయెల్, అమెరికా వైమానిక దాడుల ప్రభావం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. యుద్ధం నేపథ్యంలో ఇన్వెస్టర్లను ఏఏ అంశాలు కలవరానికి గురిచేస్తున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**1. క్రూడాయిల్ ధరల పెరుగుదల:**

ఇరాన్ ప్రతీకార చర్యలతో పాటు, ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు టెహ్రాన్ ప్రకటించడం మార్కెట్లను భయపెట్టింది. దీనివల్ల బ్రెంట్ క్రూడ్ ధర ఒక్కసారిగా 7% పెరిగి, 14 నెలల గరిష్ట స్థాయి 82.40 డాలర్లకు చేరింది. ఫలితంగా పెయింట్, టైర్, ఏవియేషన్, కెమికల్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి.

**2. రూపాయి విలువ పతనం - FIIల అమ్మకాలు:**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితి వల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడింది. దీనివల్ల విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 27న ఒక్కరోజే వీరు సుమారు రూ.7వేల 536.4 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

**3. పెరుగుతున్న అస్థిరత:**

మార్కెట్ భయాన్ని సూచించే India VIX సూచీ ఒక్కసారిగా 15% పెరిగి 15.78 వద్ద ట్రేడ్ అవుతోంది. యుద్ధం కారణంగా ముమ్ముందు ఏం జరుగుతుందో అన్న ఆందోళన మదుపరులలో స్పష్టంగా కనిపిస్తోంది.

భయాందోళనతో షేర్లను విక్రయించడం సరైన పద్ధతి కాదన్నారు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయకుమార్. గతంలో కోవిడ్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం సమయంలోనూ మార్కెట్లు ఇలాగే స్పందించినా, ఆరు నెలల తర్వాత మళ్లీ కోలుకున్నాయి. కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉంటూ.. బ్యాంకింగ్, ఆటోమొబైల్ వంటి నాణ్యమైన షేర్లను కొనుగోలు చేయడానికి ఈ మార్కెట్ పతనాన్ని అవకాశంగా మార్చుకోవాలని సూచించారు.

## ఎడిటోరియల్

# వైసీపీ సర్వేలను నమ్ముకుంటోందా ?

ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ ఉంది. అయితే అసెంబ్లీలో వైసీపీ కనిపించడం లేదు, ఆ పార్టీ అధినాయకత్వం అయితే జనంలోకి వెళ్ళడం లేదు, ఇక పార్టీ నాయకులు కూడా జనంలోకి వెళ్తున్న విషయాలు తక్కువగానే ఉన్నాయి. మరో వైపు చూస్తే కనుక మీడియా మీటింగులతోనే బిగ్ సౌండ్ చేసే నేతలు కనిపిస్తున్నారు. ఇటీవల కాలంలో తిరుమల లడ్డూ వివాదంలో కూడా వైసీపీ కొంత ఇబ్బంది పడింది. అయినా సరే తన వైపు వెర్షన్ ని వినిపిస్తోంది.

**జైలు పాలు అవుతున్నారు :**

ఇంకో వైపు చూస్తే వైసీపీకి చెందిన నేతలు వరసగా జైలు పాలు అయ్యారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు జైలుకు వెళ్ళి వచ్చారు. ఆయన మీడియా ముందు మళ్ళీ గట్టిగానే మాట్లాడుతున్నారు. అంబటి ఏపీలో హాట్ టాపిక్ అయ్యారని వైసీపీకి సానుభూతి వచ్చిందని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో కేవలం ఇరవై నెలలలోనే టీడీపీ కూటమి పని అయిపోయింది అని వైసీపీ నేతలు అంటున్నారు వచ్చేది జగన్ ప్రభుత్వమే అని ధీమాగా చెబుతున్నారు.

**సర్వేలతోనేనే :**

ఇదిలా ఉంటే ఆ మధ్యన లిక్కర్ స్కాం కేసులో జైలుకి వెళ్ళి వచ్చిన ఒక నాయకుడు మళ్ళీ సర్వేలు చేయిస్తున్నారు అని అంటున్నారు. ఆయన తాజాగా సర్వే చేయించి అధినాయకత్వం ముందు పెట్టారని ఆ సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వైసీపీ స్వీప్ చేస్తుందని పేర్కొన్నారు అని అంటున్నారు. దానికి కారణాలు ఏమిటి అంటే లడ్డూ ఇష్యూ అధికార పక్షానికి బూమరాంగ్ అయిందని అలాగే అంబటి రాంబాబు ఎపిసోడ్ లో సానుభూతి వచ్చిందని కూటమి పాలన పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని అంటున్నారు. అయితే అంత వ్యతిరేకత కూటమి ప్రభుత్వం మీద నిజంగా ఉందా అన్నది ఒక చర్చ. ఈ రకమైన సర్వే నివేదికను సొంత పార్టీ వారే పెద్దగా నమ్మడం లేదని అంటున్నారు.

**గతంలోనూ అదే తీరు :**

ఇక ఆ నాయకుడు గతంలో అంటే వైసీపీ అధికారంలో ఉన్నపుడు కూడా ఇదే తీరున సర్వేలు చేయించి వైసీపీకి ఢోకా లేదని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తుంది అని చెప్పారని గుర్తు చేస్తున్నారు. తీరా ఫలితం చూస్తే దారుణంగా వచ్చిందని అంటున్నారు. అందువల్ల సర్వేలను నమ్ముకోకుండా వైసీపీ జనంలోకి వెళ్ళాలని గ్రౌండ్ రియాలిటీస్ చూడాలని సూచనలు వస్తున్నాయి. ఏ పార్టీ అయినా ప్రజలతో ఉంటేనే జనాల ఆదరణ దక్కుతుందని వైసీపీ ఆ విధంగా ముందుకు సాగాలని తప్పించి సర్వేలను నమ్ముకుంటే మళ్ళీ ఇబ్బందులే ఎదురవుతాయని అంటున్న వారూ ఉన్నారు. మొత్తానికి చూస్తే వైసీపీలో ధీమా పెరుగుతోంది. ఏ రాజకీయ పార్టీకి అయినా ధీమా ఉండడం తప్పు లేదు, కానీ అది అతి ధీమా కాకూడదని అంటున్నారు. పైగా గ్రౌండ్ లెవెల్ రియాలిటీస్ ఎప్పటికపుడు చెక్ చేసుకోవాల్సి ఉంటుంది అంతే తప్ప సర్వేల పేరుతో భ్రమలలోకి వెళ్తే ట్రబుల్స్ తప్పవని అంటున్నారు.

# గర్భాశయ క్యాన్సర్‌కు మహిళలు బలి కావాల్సిందేనా?

భారతదేశంలో మహిళల ప్రాణాలను హరిస్తున్న వ్యాధుల్లో ఇది రెండో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు దీని బారిన పడుతున్నారు. అయితే ఈ వ్యాధిలో ఉన్న ఒకే ఒక్క ఊరట కలిగించే విషయం ఏంటంటే.. దీనిని మనం ముందే గుర్తించి 100 శాతం నివారించవచ్చు. దురదృష్టవశాత్తూ మన దేశంలో అవగాహన లేకపోవడం, పరీక్షలు చేయించుకోవడానికి మొహమాటపడటం వల్ల చాలా మంది మహిళలు చివరి దశలో ఆసుపత్రికి వస్తున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అసలు ఈ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఎందుకు వస్తుంది? మన శరీరంలో జరిగే ఎలాంటి మార్పులు ప్రమాదానికి సంకేతాలు? గర్భాశయ ముఖద్వారం లేదా సెర్విక్స్ అనేది గర్భాశయానికి, యోనికి మధ్య ఉండే ఒక కండరాల ద్వారం. ఇది మన శరీరంలో ఒక మల్టీ టాస్కర్ లాగా పనిచేస్తుంది. బయటి ఇన్ఫెక్షన్లు గర్భాశయంలోకి వెళ్లకుండా రక్షణ కవచంలా అడ్డుకుంటుంది. పీరియడ్స్ సమయంలో రక్తం బయటకు వెళ్లేలా చూస్తుంది. అంతేకాకుండా, శిశువు జనన సమయంలో ఇది వ్యాకోచించి ప్రసవం సులభంగా జరిగేలా చేస్తుంది. ఇంతటి కీలకమైన సెర్విక్స్ ఆరోగ్యంగా ఉంటేనే మహిళల పునరుత్పత్తి వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది.

పొంచి ఉన్న ముప్పు..గర్భాశయానికి వచ్చే సమస్యలు కేవలం క్యాన్సర్ మాత్రమే కాదు, సాధారణ వాపు నుంచి రకరకాల ఇబ్బందులు కలగవచ్చు. క్యాన్సర్ రావడానికి ముందు కణాలలో జరిగే మార్పు గర్భాశయ డిస్ప్లాసియా. ఇది కంటికి కనిపించదు, కేవలం పరీక్షల ద్వారానే బయటపడుతుంది. గర్భాశయ క్యాన్సర్‌కు ప్రధాన కారణం హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (ఊఖ౦). ఈ వైరస్ చాలా కాలం పాటు శరీరంలో



ఉంటే అది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంది. గర్భాశయంలో పెరిగే చిన్న గడ్డలు. ఇవి అన్నీ క్యాన్సర్ కానప్పటికీ, వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షించుకోవడం ఉత్తమం.

పాటించాల్సిన జాగ్రత్తలు.. పరిశుభ్రత: పీరియడ్స్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. నాణ్యమైన శానిటరీ ప్యాడ్‌లు వాడాలి. వాటిని నిర్ణీత సమయానికి మారుస్తూ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లను అరికట్టవచ్చు. స్క్రీనింగ్ పరీక్షలు: 25 ఏళ్లు దాటిన ప్రతి మహిళ క్రమం తప్పకుండా పాప్ స్మెర్, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల క్యాన్సర్ రాకముందే కణాల్లో మార్పులను గుర్తించవచ్చు.టీకా వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చు. 11 ఏళ్ల నుంచి 26 ఏళ్ల లోపు ఈ టీకా తీసుకోవడం చాలా శ్రేయస్కరం. జీవనశైలి మార్పులు: ధూమపానం వంటి అలవాట్లు మానుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని పక్కన పెట్టి, పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. లక్షణాలను గుర్తించడం: పొత్తికడుపు నొప్పి లేదా అసాధారణ రక్తస్రావాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. మీ శరీరంలో ఈ క్రింది మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలి. యోని నుండి విపరీతమైన స్రావం కావడం, దాని రంగు లేదా వాసనలో మార్పు రావడం ప్రధాన లక్షణాలు. పీరియడ్స్ మధ్యలో లేదా శృంగారం తర్వాత రక్తస్రావం కావడం, శృంగార సమయంలో విపరీతమైన నొప్పి రావడం ప్రమాద సంకేతాలు. పొత్తికడుపు లేదా నడుము భాగంలో మొండి నొప్పి వేధిస్తున్నా అది గర్భాశయ సమస్యే కావచ్చు. గర్భాశయ క్యాన్సర్ అనేది అకస్మాత్తుగా వచ్చేది కాదు. ఇది శరీరంలో కణాల మార్పు ద్వారా నెమ్మదిగా మొదలవుతుంది. మనకు సరైన అవగాహన ఉండి, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటే దీని నుంచి 100 శాతం కోలుకోవచ్చు. మీ శరీరం ఇచ్చే చిన్న చిన్న సంకేతాలను కూడా విస్మరించకండి.

# భోజనం చేసే సమయంలో చెమట పడితే డయాబెటిస్ వస్తుందా?

కొంత మందికి భోజనం చేసేటప్పుడు చెమట పడుతుంది. ముఖ్యంగా నుదిటిపై చెమట ఎక్కువగా పడుతుంది. వేడి ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని అందరూ అనుకుంటారు. కానీ మీరు చల్లగా ఏదైనా తిన్నప్పుడు లేదా తాగిన ప్రతిసారీ ఇలా జరిగితే లేదా చలికాలంలో కూడా ఇలా చెమట పడుతుంటే అది సాధారణం కాదు. కొంతమంది తినేటప్పుడు చెమట పట్టడం మీరు గమనించి ఉంటారు. కొంతమందికి తక్కువ మొత్తంలో చెమట పడుతుంటే, మరికొందరికి ఏకదాటిగా చెమట పడుతుంది. ముఖ్యంగా నుదిటిపై చెమట ఎక్కువగా పడుతుంది. వేడి ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని అందరూ అనుకుంటారు. కానీ మీరు చల్లగా ఏదైనా తిన్నప్పుడు లేదా తాగిన ప్రతిసారీ ఇలా జరిగితే లేదా చలికాలంలో కూడా ఇలా చెమట పడుతుంటే అది సాధారణం కాదు. కాబట్టి దీనికి కారణం ఏమిటి? ఇది ఏదైనా వ్యాధికి సంకేతమా? ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ హిమాన్షు భదాని మాట్లాడుతూ.. తినేటప్పుడు చెమట పట్టే సమస్యను వైద్యపరంగా గస్టేటరీ చెమట అని పిలుస్తారు. అధిక కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు శరీరం చెమట పట్టడం ప్రారంభిస్తుంది. ఇది సాధారణంగా వెచ్చని శరీరం ఉన్నవారిలో కనిపిస్తుంది. తినేటప్పుడు చెమట పట్టడం కొందరికి సాధారణం. కానీ మరికొందరికి ఇది వివిధ వ్యాధుల లక్షణం కావచ్చు. డాక్టర్ హిమాన్షు మాట్లాడుతూ భోజనం చేసేటప్పుడు



చెమటలు పట్టడం మధుమేహం ప్రారంభ లక్షణం కావచ్చు. ఎవరికైనా డయాబెటిస్ ఉంటే అది నరాల దెబ్బతినడానికి కారణమవుతుంది. కాబట్టి ఇది భోజనం చేసేటప్పుడు చెమట పట్టడానికి దారితీస్తుంది. కానీ ఇది అన్ని సందర్భాల్లోనూ జరగదు. కొందరికి ఇది థైరాయిడ్ లేదా హార్మోన్ల మార్పుల వల్ల కూడా జరగవచ్చు. పెద్దల మాదిరిగానే పిల్లలు కూడా తినేటప్పుడు చెమట పట్టవచ్చు. పిల్లలు కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు, దానిని జీర్ణం చేసుకోవడానికి వారి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది చెమట పట్టడానికి దారితీస్తుంది. అయితే సాధారణ ఆహారం తిన్నప్పుడు కూడా పిల్లలకు చెమటలు పడుతుంటే లేదా వేగంగా బరువు తగ్గుతుంటే, తినేటప్పుడు వారి హృదయ స్పందన రేటు పెరగకపోతే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# రోజుకు ఎన్ని కప్పులు కాఫీ తాగుతున్నారు?



ఉదయం నిద్రలేచిన వెంటనే ఘుమఘుమలాడే కప్పు కాఫీ లేకుండా చాలా మందికి రోజు ప్రారంభం కాదు. కాఫీలోని కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ ఒక రోజులో ఎన్ని కప్పుల కాఫీ తాగాలి? ఎప్పుడు తాగాలి? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం. కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. చాలా మందికి కాఫీ అంటే కేవలం పానీయం కాదు, అదొక సెంటిమెంట్. అందుకే ఉదయం నిద్రలేచిన వెంటనే ఘుమఘుమలాడే కప్పు కాఫీ లేకుండా వీరికి రోజు ప్రారంభం కాదు. కాఫీలోని కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ ఒక రోజులో ఎన్ని కప్పుల కాఫీ తాగాలి? ఎప్పుడు తాగాలి? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం. కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. కాఫీలోని కెఫిన్ మెదడును ఉత్తేజపరుస్తుంది. మగతను దూరం చేస్తుంది. అలాగే కాఫీని మితంగా తాగడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ కాలేయం నుంచి విషాన్ని బయటకు పంపి, కొవ్వు కాలేయ సమస్యను తగ్గిస్తుంది. ఇది శరీరంలో జీవక్రియ వేగాన్ని పెంచుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. పరిశోధన ప్రకారం బ్లాక్ కాఫీ టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం రోజుకు 2 కప్పుల కాఫీ తాగడం సురక్షితం. అయితే ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదు. ఒక కప్పు కాఫీలో దాదాపు 100 మిల్లీగ్రాముల కెఫిన్ ఉంటుంది. కాబట్టి ఆరోగ్యవంతమైన వ్యక్తులు ఒక రోజులో రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగవచ్చు. మీరు రోజుకు 4-5 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే, అది తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. అధికంగా కాఫీ సేవిస్తే చేతులు, కాళ్ళు నిరంతరం వణుకుట లేదా చిరాకు వంటి సమస్యలను కలిగిస్తుంది. అలాగే కెఫిన్ రక్తపోటులో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతుంది. దానితో పాటు, కాఫీ వల్ల కలిగే అతిపెద్ద సమస్య రాత్రి సమయానికి నిద్రపోలేకపోవడం. అలాగే కాఫీ కడుపు రుగ్మతలకు కూడా కారణమవుతుంది. ఎక్కువ కాఫీ పిత్తాన్ని పెంచుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాఫీ తాగడం చాలా ప్రభావవంతంగా ఉంటుంది. కానీ సాయంత్రం 4 గంటల తర్వాత కాఫీ తాగకపోవడమే మంచిది. కాఫీలోని కెఫిన్ ప్రభావం శరీరంలో 12 గంటలకు పైగా ఉంటుంది. మీరు సాయంత్రం వేళల్లో కాఫీ తాగితే, అది రాత్రి నిద్రకు భంగం కలిగిస్తుంది. దీని వలన మరుసటి రోజు మొత్తం అలసిపోయినట్లు అనిపిస్తుంది.

PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
మంగళవారం 3 మార్చి 2026

# అతడికి తుది జట్టులో చోటే ఎక్కువ... అలాంటిది కెప్టెన్సీ కూడానా?: షాహిద్ అఫ్రిది

- సూపర్-8 దశలోనే టీ20 ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్
- ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ ప్రదర్శనపై షాహిద్ అఫ్రిది తీవ్ర విమర్శలు
- కోచ్ మైక్ హెసన్ వల్లే షాదాబ్‌కు అవకాశాలు వస్తున్నాయని ఆరోపణ
- పాక్ తదుపరి కెప్టెన్‌గా ఫఖర్ జమాన్ సరైనోడన్న అఫ్రిది




టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశలోనే ఇంటిబాట పట్టడంతో ఆ జట్టు నాయకత్వంపై తీవ్ర చర్చ మొదలైంది. వరుసగా నాలుగోసారి ఐసీసీ ఈవెంట్లలో సెమీఫైనల్ చేరడంలో పాక్ విఫలమవడంతో, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది జట్టు కూర్పుపై, ముఖ్యంగా ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ప్రస్తుత పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా నేతృత్వంలో జట్టు ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయింది. దీంతో కెప్టెన్సీ మార్పు ఖాయమని వార్తలు వస్తున్న నేపథ్యంలో షాదాబ్ ఖాన్, షహీన్ అఫ్రిది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. దీనిపై సమా టీవీతో మాట్లాడిన షాహిద్ అఫ్రిది.. షాదాబ్ ఖాన్ పేరును ప్రస్తావించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశాడు. “షాదాబ్ ప్రదర్శన చూస్తుంటే అతనికి అసలు తుది జట్టులో చోటు ఇవ్వడమే ఎక్కువ.. అలాంటిది కెప్టెన్సీ ఎలా ఇస్తారు?” అని ప్రశ్నించారు. ఈ టోర్నీలో 7 మ్యాచ్‌లు ఆడిన షాదాబ్ కేవలం 118 పరుగులు చేసి, 5 వికెట్లు మాత్రమే తీయడాన్ని ఎత్తిచూపాడు.ప్రధాన కోచ్ మైక్ హెసన్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్లే షాదాబ్ జట్టులో కొనసాగుతున్నాడని అఫ్రిది ఆరోపించారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టుకు హెసన్ కోచ్‌గా ఉన్నప్పటి నుంచి వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం ఉందని, అందుకే షాదాబ్‌కు హెసన్ వరుస అవకాశాలు ఇస్తున్నారని విమర్శించారు. ఇటీవల ప్రదర్శన చూస్తే షాదాబ్ అసలు తుది జట్టుకు ఎంపిక చేయడానికి కూడా కూడా అనర్హుడని తేల్చిచెప్పాడు.మరోవైపు ప్రస్తుత కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా ఈ టోర్నీలో దారుణంగా విఫలమయ్యాడు. ఏడు ఇన్నింగ్స్‌లలో కేవలం 10 సగటుతో 60 పరుగులు మాత్రమే చేశాడు. గత ఏడాది కాలంలో పాకిస్థాన్ జట్టుకు ఇతను నాలుగో కెప్టెన్ కావడం గమనార్హం.

ఈ నేపథ్యంలో జట్టుకు దూకుడుగా నిర్ణయాలు తీసుకునే నాయకుడు కావాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ఓపెనర్ ఫఖర్ జమాన్ ఆ బాధ్యతలకు సరిపోతాడని అఫ్రిది అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో జరిగిన చివరి సూపర్-8 మ్యాచ్‌లో పాక్ పోరాడినప్పటికీ, సెమీస్ అవకాశాలను దక్కించుకోలేకపోయింది. దీంతో పాక్ క్రికెట్ బోర్డు త్వరలోనే కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో టీమిండియా సిరీస్... షెడ్యూల్ విడుదల

- జూన్‌లో భారత్ పర్యటనకు రానున్న ఆఫ్ఘనిస్థాన్ పురుషుల జట్టు
- ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్ షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ
- జూన్ 6 నుంచి న్యూ చండీగఢ్ వేదికగా ఏకైక టెస్టు మ్యాచ్ ప్రారంభం
- ధర్మశాల, లక్నో, చెన్నై వేదికలుగా వన్డే సిరీస్ నిర్వహణ
- షెడ్యూల్ వివరాలను వెల్లడించిన బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా




భారత క్రికెట్ అభిమానులకు బీసీసీఐ సోమవారం కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఆఫ్ఘనిస్థాన్ పురుషుల జట్టు జూన్ 2026లో భారత్‌లో పర్యటించనుందని వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య ఒక టెస్టు మ్యాచ్ మరియు మూడు వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జూన్ 6 నుంచి జూన్ 20 వరకు ఈ సిరీస్ కొనసాగుతుందని బీసీసీఐ తెలిపింది.బీసీసీఐ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, సిరీస్ ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. జూన్ 6 నుంచి 10 వరకు న్యూ చండీగఢ్‌లోని పీసీఏ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మైదానం టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ మ్యాచ్ ప్రతీరోజు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఇది రెండో టెస్టు మ్యాచ్ కావడం గమనార్హం.

టెస్టు సిరీస్ ముగిసిన అనంతరం వన్డే సిరీస్ మొదలవుతుంది. జూన్ 14న ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో తొలి వన్డే, జూన్ 17న లక్నోలోని ఏకానా స్టేడియంలో రెండో వన్డే జరగనున్నాయి. సిరీస్‌లో చివరిదైన మూడో వన్డే మ్యాచ్‌కు చెన్నై వేదిక కానుంది. ఈ మ్యాచ్ జూన్ 20న జరుగుతుంది. అన్ని వన్డే మ్యాచ్‌లు మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయి.ఈ సిరీస్ వివరాలను బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధికారికంగా ధృవీకరించారు. భారత్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఇది మల్టీ-ఫార్మాట్ ద్వైపాక్షిక సిరీస్‌గా జరగనుందని, భారత హోమ్ సీజన్‌లో ఈ పర్యటన చాలా ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. కొత్త వేదిక న్యూ చండీగఢ్‌లో మ్యాచ్ జరగనుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ‘ఓ రోమియో‘ కోసం తమన్నా, విక్రాంత్ మాస్సే త్యాగం!





ముంబయి అండర్ వరల్డ్ డాన్‌ల రియల్ స్టోరీస్‌లతో రూపొందిన బుక్ –మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబయి–. దీని ఆధారంగా ఇప్పటికే సంజయ్ లీలా భన్సాలీ –గంగుబాయి కతియావాడి–ని రూపొందించిన సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఇదే బుక్‌ని ఆధారం చేసుకుని విశాల్ భరద్వాజ్ మరో గ్యాంగ్‌స్టర్ స్టోరీని తెరపైకి తీసుకొస్తున్నారు అదే –ఓ రోమియో–. షాహీద్ కపూర్ హీరోగా నటించాడు. –యానిమల్– ఫేమ్ త్రిప్తి దిమ్రీ హీరోయిన్. ఫిబ్రవరి 13న భారీ స్థాయిలో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలోని కీలక పాత్రల్లో విలక్షణ నటుడు నానా పటేకర్, తమన్నా, దిషా పటానీ, అవినాష్ తివారీ, ఫరీదా జలాల్ నటిస్తున్నారు. మరో కీలక అతిథి పాత్రలో –12వ్త ఫెయిల్– ఫేమ్ విక్రాంత్ మాస్సే నటిస్తున్నాడు. ముంబయి అండర్ వరల్డ్ డాన్ ఉస్తారాగా షాహీద్ కపూర్ నటించగా, అతని ప్రేయసి అఫ్షాగా త్రిప్తి దిమ్రీ నటించింది. ఇటీవల ఉస్తారా కుమార్తె అభ్యంతరాలు చెప్పడం, కోర్టును ఆశ్రయించడంతో వివాదంలో చిక్కుకున్న ఈ సినిమా ఎట్టకేలకు అన్ని అడ్డంకుల్ని అధిగమించి ఫైనల్‌గా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. తొలి సారి దర్శకుడు విశాల్ భరద్వాజ్ రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో చేసిన ఈ మూవీ ఇప్పటికే బాలీవుడ్ ట్రేడ్ వర్గాలతో పాటు మేకర్స్‌లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉంటే సినిమా రిలీజ్‌కి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇప్పటికే మేకర్స్ ప్రయోషన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ మూవీలో నటించిన తమన్నా, విక్రాంత్ మాస్సేలకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం నెట్టింట ట్రెండ్ అవుతోంది. ఈ మూవీలో తమన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, విక్రాంత్ మాస్సే కీలక అతిథి పాత్రలో కనిపించనున్నాడు.

అయితే ఈ క్యారెక్టర్ల కోసం ఈ ఇద్దరు స్టార్స్ ఓ త్యాగం చేశారట. ఈ విషయాన్ని దర్శకుడు విశాల్ భరద్వాజ్ స్వయంగా సినిమా ప్రమోషన్స్‌లో వెల్లడించడం గమనార్హం. ఇంతకీ విషయం ఏంటంటే ఈ మూవీలో నటించడానికి తమన్నా, విక్రాంత్ మాస్సే ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోలేదట. డైరెక్టర్ విశాల్ భరద్వాజ్, నిర్మాత సాజిద్ నదియావాలాపై ఉన్న నమ్మకంతో ఎలాంటి పారితోషికం తీసుకోలేదట. రెమ్యూనరేషన్‌లకు మాత్రం ప్రియారిటీ ఇచ్చే బాలీవుడ్‌లో తమన్నా, విక్రాంత్ మాస్సే –ఓ రోమియో– కోసం ఎలాంటి పారితోషికం తీసుకోకుండా నటించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ మూవీలో తమన్నా రబియాగా, దిషా పటానీ జూలీగా కనిపించనున్నారు. విక్రాంత్ మాస్సే మాత్రం ఓ ప్రత్యేక అథిగా క్యారెక్టర్‌లో మెరవనున్నాడు. గతంలో విశాల్ భరద్వాజ్‌కు చేసిన ప్రామిస్ కారణగానే తను పారితోషికం తీసుకోలేదని చెబుతున్నారు. ఇక తమన్నా ఈ మూవీ కోసం 12 రోజులు కేటాయించిందట. స్టోరీతో తనది కీ రోల్ కావడం, తక్కువ టైమ్ మాత్రమే ఉండటం, మంచి ఇంపాక్ట్ కలిగించే క్యారెక్టర్ కావడం, విశాల్‌భరద్వాజ్ సినిమా కావడం వల్లే తమన్నా కూడా పారితోషికం తీసుకోలేదట.



మంగళ మ్యాజిక్ కోసం అభిమానుల కు ఆశికా రంగనాథ్ కృతజ్ఞతలు తెలిపారు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com